క్లుప్తంగా

ఆరోగ్య సమస్యలపై అవగాహన



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ నిర్మల

కంచరపాలెం : బాలికల ఐటీఐలో బుధవారం బీఎస్‌ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 'బాలికలు–ఆరోగ్య సమస్యలు' అనే అంశంపై అవగాహన కార్యక్రమం చేపట్టారు. ముఖ్య అతిథిగా ప్రసూతి వైద్య నిపుణులు డాక్టర్ ఎ.నిర్మల బాలికలకు ఆరోగ్య సమస్యలు, వాటి పరిష్కారాలపై అవగాహన కల్పించారు. విద్యార్థినుల సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో బాలికల ఐటీఐ ప్రిన్సిపాల్ వెంకటలక్ష్మి, ఫౌండేషన్ సభ్యులు జీవీ కృష్ణారావు, జి.సుమిత్ర తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

గోపాలపట్నం: జీవీఎంసీ 89వ వార్డు చంద్రనగర్ ప్రాంతంలో బుధవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని జోన్–3 ఈఈ పోలాకి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్రాంతంలో ఎల్‌టీ లైన్ వైర్లు మార్చనున్నట్టు పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

108 అంబులెన్స్‌ల ఫిట్‌నెస్ పరిశీలన

మహారాణిపేట : రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని 108 అంబులెన్స్‌లను అధికారులు మంగళవారం పరిశీలించారు. అంబులెన్స్ పనితీరు, డ్రైవర్ల లైసెన్సులు, వాహనాల ఫిట్‌నెస్ తదితర అంశాలను పరిశీలించి డ్రైవర్లకు పలు సూచనలు చేశారు. రికార్డులు పరిశీలించారు. సంఘటన స్థలానికి 15 నిమిషాల్లో చేరుకునేందుకు డ్రైవర్లకు సూచనలు అందజేసి, సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఫ్లీట్ మేనేజర్ జగ్గరాజు, విశాఖపట్నం సిటీ కోఆర్డినేటర్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన సంగీత యూత్ ఫెస్టివల్



కీర్తనలు ఆలపిస్తున్న జయతి, మహతి

మద్దిలపాలెం: విశాఖ మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో నిర్వహిస్తున్న సంగీత యూత్ ఫెస్టివల్ మంగళవారం ముగిసింది. ఆఖరి రోజు మంగళవారం నిర్వహించిన కచేరీలో గాత్ర కళాకారులు పెరవలి సోదరీమణులు జయతి, మహతిల వయోలిన్ అద్భుతంగా సాగింది. వీరికి మృదంగంపై సాయి కేశవ్, ఘటంపై కొంటిన్యలు సహకరించారు. అనంతరం కె.నాగ వైష్ణవి గాత్ర కచేరికి కె.గాయత్రి వయోలిన్ సహకారం, జి.చంటి మృదంగంపై సంగీత సహకారం అందించారు.

ఆలయ నిర్మాణానికి టీటీడీ సాయం కోసం వినతి

సీతంపేట: జీవీఎంసీ 44వ వార్డు అక్కయ్యపాలెం మెయిన్‌రోడ్‌లో ఉన్న వేణుగోపాల స్వామి ఆలయం పునర్నిర్మాణానికి టీటీడీ నుంచి సాయం అందించాలని వార్డు కార్పొరేటర్, జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ బానాల శ్రీనివాసరావు టీటీడీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డిని కోరారు. వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు సమక్షంలో మంగళవారం ఆయన్ను కలిసి, వినతిపత్రం అందజేశారు. దీనిపై వైవీ సుబ్బారెడ్డి సానుకూలంగా స్పందించారని బానాల శ్రీనివాసరావు తెలిపారు.

వైభవంగా మోదకొండమ్మ పండగ



డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్‌కు చిత్ర పటం అందిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు



ఆలయ ప్రాంగణంలో అమ్మవారి విగ్రహం వద్ద పూజలు చేస్తున్న భక్తులు



గర్భగుడిలో భక్తులకు దర్శనమిస్తున్న మోదకొండమ్మ అమ్మవారు

గోపాలపట్నం: స్థానిక ఇందిరానగర్‌లో కొలువుదీరిన మోదకొండమ్మ అమ్మవారి పండగ మంగళవారం వైభవంగా జరిగింది. ఉదయం నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. తొలుత అమ్మవారి పాదాల వద్ద పూజలు చేశారు. అనంతరం గర్భగుడిలోని అమ్మవారికి గాజులు, చీరలు సమర్పించారు. మోదకొండమ్మను ఎమ్మెల్యే గణబాబు, డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, తదితర నాయకులు దర్శించుకున్నారు. భక్తులకు పలు స్వచ్ఛంద సంస్థల సభ్యులు ప్రసాదం, మజ్జిగ, మంచినీరు అందజేశారు. సాయంత్రం ఇందిరానగర్, లక్ష్మీనగర్ ప్రాంతంలో ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. సాయంత్రం నిర్వహించిన పరసతో రోడ్డు కిటకిటలాడింది.

40వ వార్డులో పట్టాల పండగ



ఇళ్ల పట్టాలు అందుకున్న వారితో 40వ వార్డు కార్పొరేటర్ నాగేశ్వరరావు

సింథియా: జీవీఎంసీ 40వ వార్డు ఏకేసీకాలనీలో మంగళవారం ఇళ్లపట్టాల పంపిణీ వేడుకగా నిర్వహించారు. సచివాలయం-1 పరిధిలో అర్హులైన లబ్ధిదారులకు పశ్చిమ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ ఆదేశాల మేరకు మంగళవారం కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలందరికీ సొంత ఇల్లు ఉండాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చరిత్రలో కనీవినీ ఎరుగని రీతిలో ఇళ్ల పట్టాలు అందజేయడం జరుగుతుందన్నారు. లబ్ధిదారులు అర్నెల్లలో ఇంటి నిర్మాణం పూర్తి చేసుకోవాలని కోరారు. ప్రభుత్వం తరఫున రూ.1. 80లక్షలు ఇవ్వడం జరుగుతుందని, అలా కట్టుకోలేని నిరుపేద కుటుంబాలకు ప్రభుత్వమే ఇల్లు కట్టి ఇస్తుందని చెప్పారు. ఈ అవకాశాన్ని లబ్ధిదారులు వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

యోగాతో ఏకాగ్రత సాధ్యం



మల్కాపురం సెయింట్ ఆన్స్ కళాశాలలో యోగా చేస్తున్న విద్యార్థులు

మల్కాపురం: స్థానిక సెయింట్ ఆన్స్ మహిళా కళాశాలలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు మంగళవారం యోగా పై అవగాహన కల్పించారు. పలు యోగాసనాలు నేర్పించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి ఇ.పి.ఎస్‌భాగ్యలక్ష్మి మాట్లాడుతూ యోగా సాధనతో ఏకాగ్రత సాధ్యమవుతుందన్నారు. ఒత్తిడి తగ్గి, ఆరోగ్యవంతమైన జీవన విధానం అలవడుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి వై.అనసూయాదేవి, ఎ.సంధ్యారాణి, వి.అంజలిదేవి, ఎన్.నదియా పాల్గొన్నారు. అలాగే స్థానిక లక్కీ అమర్ పాఠశాలలో యోగాపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వాసుదేవ్‌రావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అదుపు తప్పిన ఆర్టీసీ బస్

ద్విచక్ర వాహనం, రక్షణ గోడ ధ్వంసం



షిప్‌యార్డ్ కాలనీ రక్షణ గోడను ఢీ కొట్టిన ఆర్టీసీ బస్సు

మల్కాపురం: ఆర్టీసీ బస్ అదుపు తప్పి.. సేవా మార్గంలోని రక్షణ గోడను ఢీకొట్టింది. బస్‌లో ప్రయాణికులు లేకపోవడం, రక్షణ గోడ వద్ద జన సంచారం లేకపోవడంతో ప్రాణనష్టం తప్పింది. ఈ ఘటనలో నేవీ ఉద్యోగికి చెందిన బైక్ దెబ్బతింది. వివరాలివీ.. గాజువాక డిపోకు చెందిన 55కే బస్ మంగళవారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో కొత్తవలస నుంచి సింధియా వైపు వస్తోంది. మార్గమధ్యలో షిప్‌యార్డ్ కమర్షియల్ కాంప్లెక్స్ దగ్గరకు రాగానే బస్ ముందు చక్రానికి మధ్య గల హైడ్రోలిక్ బ్రేక్ పైపు డివైడర్‌కు రాసుకుంది. ఈ క్రమంలో డివైడర్‌లో పైపు చిక్కుకుపోవడంతో ఆందోళనకు గురైన డ్రైవర్ వేగాన్ని పెంచాడు. దీంతో బస్ అదుపు తప్పింది. గత్యంతరం లేని పరిస్థితిలో బస్ డ్రైవర్ కమర్షియల్ కాంప్లెక్స్ పక్కన గల షిప్‌యార్డ్ ఉద్యోగుల కాలనీ రక్షణ గోడను ఢీ కొట్టాడు. అక్కడకు సమీపంలో ఫుట్‌పాత్‌పై కొంత మంది పండ్లు, కూరగాయల వ్యాపారం చేస్తున్నారు. బస్ తమ మీదకు వస్తుందేమోనని భయపడి.. వ్యాపారులు అక్కడ నుంచి తప్పుకున్నారు. కాగా.. ఓ నేవీ ఉద్యోగి కొబ్బరి బొండం తాగేందుకు తన వాహనాన్ని పండ్ల దుకాణం వద్ద నిలిపాడు. అతని వాహనాన్ని బస్ బలంగా ఢీకొనడంతో దెబ్బతింది. సమాచారం అందుకున్న మల్కాపురం పోలీసులు అక్కడకు చేరుకుని.. ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చర్యలు చేపట్టారు. పొక్లెయిన్ సాయంతో బస్‌ను బయటకు తీశారు. గాజువాక ఆర్టీసీ డిపో అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదంపై ఆరా తీశారు.

వేడుకగా రథయాత్ర



రథయాత్రను ప్రారంభిస్తున్న నాయకులు

గోపాలపట్నం: పాతగోపాలపట్నంలో జగన్నాథ స్వామి రథయాత్ర వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి అధిక సంఖ్యలో భక్తులు జగన్నాథ స్వామిని దర్శించుకుని విశేష పూజలు, అభిషేకాలు చేశారు. సాయంత్రం ఆలయం నుంచి రథంలో గ్రామంలో పలు వీధుల్లో జగన్నాథ స్వామి ఉత్సవ మూర్తులను ఊరేగించారు. రథయాత్రలో స్వామిని పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు దర్శించుకున్నారు. జీవీఎంసీ కో ఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు, డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు వీరికి తీర్థ ప్రసాదాలు అందించారు.

నిందితుడు సతీష్‌ను కఠినంగా శిక్షించాలి



నిరసన వ్యక్తం చేస్తున్న దళిత సేన రాష్ట్ర నాయకులు

కంచరపాలెం: మాయ మాటలతో దళిత బాలికపై లైంగికదాడికి పాల్పడిన నిందితుడు సతీష్‌ను కఠినంగా శిక్షించాలని దళిత సేన రాష్ట్ర అధ్యక్షుడు పాల్తేటి పెంటారావు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఊర్వశి కూడలిలోని దళితసేన కార్యాలయంలో మంగళవారం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గొల్లమాల అప్పారావు ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ అమాయకురాలైన బాలికను హాస్టల్ నుండి బయటికి తీసుకెళ్లి మద్యం పట్టించి అఘాయిత్యానికి పాల్పడిన నిందితుడు సతీష్ మరో స్నేహితుడితో కలిసి లైంగిక దాడికి పాల్పడ్డారన్నారు. బాధితురాలికి న్యాయం జరిగే వరకూ దళితసేన అండగా ఉంటుందని స్పష్టం చేశారు. రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గొల్లమాల అప్పారావు మాట్లాడుతూ ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు రాజకీయ పలుకుబడి కలిగిన సతీష్‌ను కఠినంగా శిక్షించాలన్నారు. సమావేశంలో రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు నక్కెళ్ల నాగమణి, సిటీ ప్రెసిడెంట్ పుచ్చ కామేశ్వరరావు, తాడిపూడి సీతారాం, పట్నాల ఝాన్సీరాణి, గొల్లమాల మీనా తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన



లక్ష్మీనగర్‌లో అవగాహన కల్పిస్తున్న జెడ్సీ మల్లయ్యనాయుడు

గోపాలపట్నం: స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమంలో భాగంగా ఇందిరానగర్‌లో మంగళవారం సీజనల్ వ్యాధులపై పట్ల అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జోన్ కమిషనర్ మల్లయ్యనాయుడు పలు ప్రాంతాల్లో పర్యటించారు. పారిశుధ్య నిర్వహణలో అలసత్వం వహిస్తే సహించేది లేదని కార్మికులను హెచ్చరించారు. ఖాళీ స్థలాలు, ప్రభుత్వ స్థలాల్లో వ్యర్థాలు వేస్తే కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. వీటిపై ప్రత్యేక దృష్టి సారించాలని శానిటరీ సిబ్బంది అధికారులతో పాటు సచివాలయ కార్యదర్శులకు సూచించారు. అనంతరం ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ తడి,పొడి, ప్రమాదకర చెత్తలను వేర్వేరుగా అందివ్వాలని సూచించారు. వీటిని వినియోగించి విద్యుత్ ఉత్పత్తి చేస్తామన్నారు. డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు ప్రబలకుండా ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. మంచినీరు నిల్వ లేకుండా ప్రతీ శుక్రవారం శుభ్రం చేసుకుని పాత్రల్ని ఎండలో ఉంచాలని సూచించారు. నిషేధిత ప్లాస్టిక్ సంచు లు వాడితే ఫైన్లు భరించాల్సి వస్తుందని హెచ్చరించా రు. దుకాణదారులు అమ్మినా, వినియోగదారులు వాడినా జీవీఎంసీ అధికారులు కఠినంగా వ్యవహరిస్తారన్నారు. యూజర్ చార్జీలు అందరూ చెల్లించి జీవీఎంసీ అభివృద్ధికి సహకరించాలని కోరారు.

స్టీల్‌ప్లాంట్ కార్మికుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న సీజీఎం, కార్మిక నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కార్మికుల ఆత్మీయ సమ్మేళనం మంగళవారం సందడిగా జరిగింది. 1993 సంవత్సరం బ్యాచ్ కార్మికులు 30 ఏళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా సెక్టార్–1 స్టీల్‌క్లబ్‌లో ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. స్టీల్‌ప్లాంట్ స్టీల్ మెల్ట్ షాప్–1 సీజీఎం పి. శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరై కార్మికులకు శుభాకాంక్షలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ అభివృద్ధిలో ఉక్కు కార్మికుల పాత్ర ఎనలేనిదన్నారు. కార్యక్రమంలో వివిధ కార్మిక సంఘాల నాయకులు డి.ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్, అయోధ్యరామ్, కె.ఎస్.ఎన్. రావు, నీరుకొండ రామచంద్రరావు పాల్గొని కార్మికులకు శుభాకాంక్షలు తెలిపారు.

స్టీల్‌ప్లాంట్ క్వార్టర్స్‌లో చోరీ



ఇంట్లో తెరిచి ఉన్న బీరువా, చిందరవందరగా దుస్తులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ సెక్టార్–3లోని క్వార్టర్స్‌లో సోమవారం రాత్రి చోరీ జరిగింది. ఈ సంఘటనలో బంగారు, వెండి వస్తువులు అపహరణకు గురయ్యాయి. స్టీల్‌ప్లాంట్ పోలీసులు అందించిన సమాచారం మేరకు వివరాలివి.. స్టీల్‌ప్లాంట్‌లో సీనియర్ టెక్నీషియన్‌గా విధులు నిర్వహిస్తున్న జమ్మాన మోహన్‌కుమార్ సోమవారం రాత్రి షిఫ్ట్‌కు విధులకు వెళ్తూ, భార్య, పిల్లలను ఇంట్లో ఉంచి బయట తాళం వేశారు. భార్య ప్రమీల పిల్లలతో బెడ్ రూమ్‌లో పడుకుని గడియ వేసుకున్నారు. తెల్లవారుజామున రెండున్నర గంటల సమయంలో ఇంట్లోకి ఇద్దరు వ్యక్తులు ప్రవేశించారు. ఆ శబ్దం విని బయటకు వచ్చిన ప్రమీల రెండో బెడ్‌రూమ్ బయట ఇద్దరు వ్యక్తులను గమనించారు. వారు ఆమెను చూసి పట్టుకునేందుకు ప్రయత్నించగా, వెంటనే ఆమె బెడ్‌రూమ్‌లోకి వెళ్లి గడియ వేసుకున్నారు. ఆమె తన భర్తకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వడంతో, వెంటనే ఆయన ఇంటికి చేరుకున్నారు. అప్పటికే బయట తలుపు విరగ్గొట్టి ఉండటం గమనించిన మోహన్‌కుమార్ ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువాలు తెరిచి, అందులో బట్టలు కింద వేసి ఉన్నాయి. బీరువాలో వస్తువులను తనిఖీ చేయగా నల్లపూసల దండ, లాకెట్‌తో కూడిన చెయిన్, ఐదు చిన్న ఉంగరాలు, రెండు జతల చెవి రింగులు వెరసి నాలుగు తులాల బంగారం, 10 తులాల వెండి వస్తువులతో పాటు రూ.8500 నగదుతో మొత్తం రూ. 1,13,500 అపహరణకు గురైనట్టు గుర్తించారు. బాధితుల ఫిర్యాదుతో స్టీల్‌ప్లాంట్ క్రైం ఎస్ఐ ఎల్. శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పతకాలు సాధించిన క్రీడాకారులకు వీసీ అభినందన



పతకాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న ఏయూ వీసీ ప్రసాదరెడ్డి

విశాఖ స్పోర్ట్స్: ఖేలో ఇండియా పోటీల్లో పతకాలు సాధించిన క్రీడాకారులన ఏయూ వీసీ ఆచార్య పీవీజీడీ ప్రసాదరెడ్డి అభినందించారు. గౌతమబుద్ధ విశ్వవిద్యాలయంలో జూన్ 3వ తేదీతో ముగిసిన ఖేలోఇండియా విశ్వవిద్యాలయాల వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో 64 కేజీల వెయిట్ కాటగిరీలో ఎస్.పల్లవి స్వర్ణాన్ని సాధించింది. 87 కేజీల్లో టి.సత్యజ్యోతి రజతాన్ని సాధించగా... 45 కేజీల విభాగంలో బి.రాజేశ్వరి, 89 కేజీల వెయిట్‌లో ఎం.మణికంఠ కాంస్యాలు అందుకున్నారు. ఏయూ తరుపున పాల్గొన్న వీరందరినీ వీసీతో పాటు రిజిస్ట్రార్ వి.కృష్ణమోహన్ అభినందించారు. ఈసందర్భంగా వీసీ మాట్లాడుతూ పతకాలు సాధించిన క్రీడాకారులకు నగదు ప్రోత్సాహాలు అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఏయూపీఈ విభాగ సంచాలకుడు విజయ్‌మోహన్, హెడ్ ఎ.పల్లవి తదితరులు పాల్గొన్నారు.

మూడు స్కూల్ బస్సులపై కేసులు



స్కూల్ బస్సులను తనిఖీ చేస్తున్న రవాణా శాఖ అధికారులు

గోపాలపట్నం: రవాణా శాఖ అధికారులు చేపట్టిన తనిఖీల్లో ఫిట్‌నెస్ లేని మూడు స్కూల్ బస్సులపై కేసులు నమోదు చేశారు. మంగళవారం ఎన్ఏడీ, మద్దిలపాలెం, బోయపాలెం, గాజువాక, శీలానగర్, బీచ్ రోడ్డు ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టారు. ఇప్పటి వరకు ఏడు బస్సులపై కేసులు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ తనిఖీలు ఈ నెల 30 వరకు కొనసాగుతాయని పేర్కొన్నారు. మోటార్ వాహన తనిఖీ అధికారులు బుచ్చిరాజు, గణేష్ రెడ్డి, బాలాజీ రావు, హరి ప్రసాద్, మన్మోహన్, శ్రీనివాస్ యాదవ్, పి.శిరీష, సత్యంనాయుడు, సృజన, మాధవి తదితరులు పాల్గొన్నారు.

స్పందన ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి



స్టేషన్‌లో ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న సీపీ త్రివిక్రమవర్మ

ఆరిలోవ: నగర సీపీ త్రివిక్రమవర్మ మంగళవారం ఆరిలోవ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మిక తనిఖీ చేశారు. సీపీ వాహనం వచ్చి స్టేషన్ ఎదుట ఆగేసరికి పోలీసు సిబ్బంది ఒక్కసారిగా కంగుతిన్నారు. అందరూ వెంటనే అప్రమత్తమయ్యారు. ఎక్కడవారు అక్కడే సర్దుకున్నారు. ఇక్కడ స్టేషన్‌ను పరిశీలించారు. రికార్డులను తనిఖీ చేశారు. స్టేషన్‌లో ఇరుకుగా ఉన్న గదులను చూసి ఆశ్చర్యం వ్యక్తం చేశారు. సిబ్బంది పనితీరు, ఇక్కడ నమోదవుతున్న కేసుల గురించి సీఐ సోమశేఖర్‌ను అడిగి తెలుసుకున్నారు. స్టేషన్‌కు ఫిర్యాదు చేయడానికి వచ్చిన ప్రజలతో మర్యాదపూర్వకంగా ప్రవర్తించాలని, సిబ్బందికి సీపీ సూచించారు. స్పందన కార్యక్రమంలో వచ్చిన ఫిర్యాదులను తక్షణమే విచారణ చేపట్టి పరిష్కరించాలన్నారు. రౌడీ షీటర్లపై పూర్తి స్థాయిలో నిఘా పెట్టాలని ఆదేశించారు. అనంతరం అక్కడి నుంచి బయలుదేరి హనుమంతవాక వద్ద విమ్స్ ప్రాంగణంలో చేపడుతున్న కొత్త పోలీస్ స్టేషన్ భవన నిర్మాణాన్ని పరిశీలించారు. ఎంత వరకు పనులు జరిగాయో ఆరా తీశారు. త్వరితగతిన పనులు చేపట్టాలని ఆదేశించారు.

పోలీసుల అదుపులో రమ్మీ ఆటగాళ్లు

ఆరిలోవ: ఆరిలోవ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ హోటల్‌లో గుట్టుగా రమ్మీ ఆడుతున్న యువకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆరిలోవ ప్రాంతంలో ఓ హోటల్‌లో ఆన్‌లైన్‌లో రమ్మీ ఆడుతున్నట్లు టాస్క్‌ఫోర్స్ పోలీసులకు సమాచారం అందింది. ఆ హోటల్‌పై మంగళవారం సాయంత్రం దాడి చేసా రమ్మీ ఆడుతున్న నలుగురు యువకులతో పాటు 12 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

ఘనంగా నిత్యకల్యాణం



పాల్గొన్న ఉభయదాతలు



తలంబ్రాలు ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్ఠంపజేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు ప్రసాదం, అక్షింతలు, శేషవస్త్రాలు అందజేశారు.

ట్యాంకర్ ఢీకొని యువకుడి మృతి



క్రాంతికుమార్ (ఫైల్)

పెదగంట్యాడ: గంగవరం పోర్టు వంతెనపై సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం పాలయ్యాడు. న్యూపోర్టు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని దాసరి వీధి లో నివాసం ఉంటున్న దాసరి క్రాంతికుమార్ (22) డిప్లొమా పూర్తి చేసి, ఉద్యోగాన్వేషణలో ఉన్నాడు. సోమవారం రాత్రి 8.15 గంటల సమయంలో తన ద్విచక్రవాహనంలో పెట్రోల్ వేయించుకునేందుకు పోర్టు వంతెనపై నుంచి పెట్రోల్ బంక్‌కు వెళ్తుండగా, వెనుక నుంచి వచ్చిన ట్యాంకర్ ఢీకొట్టింది. దీంతో ఆ యువకుడు రోడ్డుపై పడిపోయాడు. స్థానికుల సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్న 108 సిబ్బంది యువకుడిని చికిత్స నిమిత్తం కిమ్స్ ఐకాన్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికి త్స పొందుతూ రాత్రి 10.30 గంటల సమయంలో మృతి చెందాడు. మృతుని తండ్రి దాస రి శంకరరావు ఫిర్యాదు మేరకు న్యూపోర్టు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

'నాలుగేళ్ల డిగ్రీ నిర్ణయం ఉపసంహరించుకోవాలి'



వీసీ ప్రసాదరెడ్డికి వినతిపత్రం అందిస్తున్న కమిటీ సభ్యులు

ఏయూ క్యాంపస్: ప్రస్తుత విద్యా సంవత్సరం నుంచి నాలుగు సంవత్సరాల కాల పరిమితితో డిగ్రీ కోర్సులను ప్రవేశ పెట్టాలనే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని అఖిల భారత విద్య పరిరక్షణ కమిటీ సభ్యులు కోరారు. మంగళవారం ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. దీనిపై స్వయం ప్రతిపత్తి కలిగిన విశ్వవిద్యాలయాలు చొరవ తీసుకుని చర్చలు జరపాలి సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఈసీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఎస్.చంద్రశేఖర్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.గోవిందరాజులు, సభ్యులు శ్రీ రామప్రభు, హెనా తదితరులు పాల్గొన్నారు.